క్లుప్తంగా

మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించాలి



సదస్సులో మాట్లాడుతున్న విజయలక్ష్మి

గోపాలపట్నం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు – హింస అనే అంశంపై ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఐద్వా జోన్ అధ్యక్షురాలు వి. ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్. విజయలక్ష్మి మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అంతా తీవ్రంగా ఖండించాలని అన్నారు. ప్రభావతి మాట్లాడుతూ మహిళలకు అండగా ఐద్వా ఉంటుందని తెలిపారు. జూలై 28 నుంచి విశాఖలో ప్రారంభమవుతున్న మహిళా జాతా ప్రారంభ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకురాలు సత్యవేణు, ముత్యాలమ్మ, పాలమ్మ, అనసూయ, లీలావతి, కాంతం తదితరులు పాల్గొన్నారు.

నరవ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్–6 కమిషనర్ పొందూరు సింహాచలం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులచే మొబైల్ ఫోన్ ద్వారా సిటిజన్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో చిట్టిమి నాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం



ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం బుధవారం నేలకొరిగింది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ సిమెంట్ దిమ్మ అకస్మాత్తుగా నేలకొరిగింది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు భయాందోళనలకు గురయ్యారు. ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఆదేశాల మేరకు ఏఈ వీర్రాజు పర్యవేక్షణలో సిబ్బంది స్తంభానికి మరమ్మతులు చేశారు.

నైట్ షెల్టర్‌కు నిత్యావసర సరకుల అందజేత



నైట్ షెల్టర్ ప్రతినిధులకు నిత్యావసరాలు అందిస్తున్న సదా ప్రతినిధులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఉన్న నైట్ షెల్టర్‌కు చిటికల్ల మిధున్ కుమార్ రెడ్డి సమకూర్చిన నిత్యావసరాలను సదా ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధుల ద్వారా అందించారు. ఈ సందర్భంగా సదా సంస్థ ప్రతినిధి కోనాల సంజీవన్ మట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సాటి వారికి సాయం చేయాలని కోరారు. సదా ఎన్‌జీవో సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దరుణ్ చందు, సంపత్, కిరణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలపాలిట రక్ష.. జగనన్న సురక్ష

40,62,63 వార్డుల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత



62వ వార్డులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

సంక్షేమ పథకాల కోసం గతంలో ఉద్యమాలే జరిగేవి. కానీ నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమం గడప వద్దే అందుతుండటంతో ప్రజల ఆనందానికి అవధులు లేవు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రజలు ముక్తకంఠంతో పలుకుతున్నారు.

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, దుర్గానగర్–4, ఏఎస్సార్ కాలనీ, జాలారివీధి, గాంధీజీ వీధి సచివాలయ పరిధిలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలోనూ, జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40, 63 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. పశ్చిమ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, జెడ్పీ ఆర్జీవీ కృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని అర్హులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఏ కారణం చేతనైనా అర్హత ఉండీ మిగిలిపోయిన లబ్ధిదారులకు జగనన్న సురక్ష ద్వారా మంచి జరుగుతుందని తెలిపారు. జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ తదితర 11 రకాల ధ్రువప్రతాలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా అందించారు.

40వ వార్డులో జగనన్న సురక్ష ద్వారా 247 సర్టిఫికెట్లను అందజేశారు. వాటిలో 60 ఆదాయ, 185 కుల, 1 ఫ్యామిలీ, 1 మ్యారేజ్ సర్టిఫికెట్ చొప్పున అందజేశారు. అదే విధంగా 62వ వార్డులో 2176 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 1957 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో 1121 మందికి కుల, 563 మందికి ఆదాయ, 2 ఫ్యామిలీ, 270 నివాస, 1 రైస్‌కార్డుకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేశారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆఫీసుల చుట్టు కాళ్లరిగేలా తిరిగేవాళ్లం..



గతంలో కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టు కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితముండేది కాదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడేవాళ్లం. కానీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు మా ఇంటికి వచ్చి పరిస్థితి తెలుసుకుని కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్లు అందజేయం సంతోషంగా ఉంది.

–గుండపు సూర్యం, ఏకేసీకాలనీ.

ఎక్కడికీ వెళ్లకుండా సర్టిఫికెట్ అందుకున్నాను..



గతంలో కుల ధృవీకరణ పత్రాల కోసం అనేక ఇబ్బందులు పడ్డాను. ఎక్కడికి వెళ్లినా సరైన పత్రాలు లేవంటూ తిరిగి పంపేవాళ్లు. కానీ నేడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి దగ్గరే సర్టిఫికెట్ అందజేశారు. జగనన్న సురక్ష క్యాంపును ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహనరెడ్డికి రుణపడి ఉంటాం.

–శరగడం గంగరాజు, 40వ వార్డు.

ప్రభుత్వ పనితీరు అమోఘం..



మా అమ్మ చనిపోతే ఆమె పేరు మీద ఉన్న ఇంటిని మార్చడానికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఏ విధంగా దరఖాస్తు చేయాలో కూడా తెలియని పరిస్థితుల్లో సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించారు. కేవలం వారం రోజుల్లోనే సర్టిఫికెట్‌ను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేశారు. రాజన్న రాజ్యంలో పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు అమోఘం. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పాదాభివందనాలు.

–సియ్యాద్రి వెంకటరావు, 40వ వార్డు.

పేదలపై ప్రేమకు నిదర్శనమే.. ఈ సంక్షేమం

- జగనన్న సురక్ష కార్యక్రమంలో పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్
- 58వ వార్డులో అర్హులకు ధ్రువపత్రాల అందజేత



లబ్ధిదారుకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ సామాజిక భవనం వద్ద బుధవారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల వలంటీర్లు తమ పరిధిలో గల ఇళ్లకు వెళ్లి ఆదాయ, నివాస, కుల, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు, జనన, మరణ ధ్రువపత్రాల వంటి 11 రకాల సేవలను అర్హులకు వారి ఇంటి వద్దే అందిస్తున్నారు అన్నారు. జగనన్నకు ప్రజల మీద ఉన్న ప్రేమకు ఇదే నిదర్శనం అన్నారు. గతంలో ఎలాంటి ధ్రువపత్రం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదని, అర్హత ఉంటే చాలు వలంటీర్లే నేరుగా ఇంటికి వచ్చి సేవలందిస్తారని వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు చూడాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కరోనా సమయంలో కూడా జగనన్న సంక్షేమాన్ని విస్మరించలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు అలాంటి నాయకుడు ఒక్కడు చాలు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, డిప్యూటీ ఎంఆర్‌వో నీలకంఠరావు, ఏపీడీ చిరంజీవి, ఆర్‌వో శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపండి



చదువుకుంటే కలిగే ప్రయోజనాలను ఓ తల్లికి వివరిస్తున్న అధికారులు

మల్కాపురం: పిల్లలను బడికి పంపాలని, చదువు పిల్లల భవిష్యత్‌కు వెలుగునిస్తుందని ములగాడ మండల ఎంఈఓ–1 డి.వి.త్రినాథరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 61వ వార్డు మల్కాపురం, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఐదేళ్లు దాటిన పిల్లలు బడిలో ఉండాలనే కార్యక్రమంలో భాగంగా బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఎంఈఓ–1 త్రినాథరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ మల్కాపురం, హరిజన వీధి, ప్రకాష్‌నగర్ ప్రాంతాలకు వెళ్లి అక్కడ తల్లులకు పిల్లలను బడికి పంపించాలని చెబుతూ చదువు వలన ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఓ తల్లి తన కుమారుడిని జీవీఎంసీ పాఠశాలలో బుధవారం చేర్పించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన ఆనంద్‌కుమార్



ఇళ్ల నిర్మాణంపై అధికారులను ఆరా తీస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. మౌలిక వసతులు, నాణ్యత తదితర అంశాలను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో గూడు లేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ సుమారు 336 టిడ్కో ఇళ్లను నిర్మిస్తున్నారని అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వీటిని అర్హులైన పేదలకు అందజేస్తామన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా సొంతింటి కల నెరవేరుతున్నందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆనంద్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, తోనంగి వెంకటరమణి, నాయకులు కోటా కృష్ణ, వేణు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రినాథ్‌పురం, ఏఎస్ఆర్‌కాలనీ, దుర్గానగర్, ఎన్‌టీఆర్‌కాలనీ, మల్కాపురం, గాంధీజీవీధి, పల్లవీధి, హరిజన వీధి, ఇండస్ట్రియల్‌కాలనీ, జాలరివీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధి పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్, ఉప్పరకాలనీ, శ్రీరామ్‌నగర్, గొందేశివానిపాలెం, కోడిపందాలదిబ్బ, శ్రీనివాస్‌నగర్, గుల్లలపాలెం, రామ్‌నగర్, కుంచిమాంబకాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



నీరు నిల్వ ఉన్న చోట గంబూషియా చేపల్ని వదులుతున్న కార్పొరేటర్ రమణ

గోపాలపట్నం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జీవీఎంసీ పలు రకాల చర్యలు చేపడుతోందని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. ఈ నేపథ్యంలో కాకానినగర్, విమాన్ నగర్ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణకు గంబూషియా చేపల్ని విడిచిపెట్టారు. అవి దోమల లార్వాని ఆహారాన్ని తీసుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుంభవృష్టి

భారీ వర్షానికి నీట మునిగిన ఐవోసీ సేవా మార్గం



జ్ఞానాపురం గెడ్డవీధిలో చేరిన వర్షపు నీరు



వర్షానికి నీట మునిగిన ఐవోసీ మార్గం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు తెరుపు లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు సేవా మార్గాలు నీటితో నిండిపోయాయి. కాలువలు, గెడ్డలు పొంగాయి. కొండవాలు ప్రాంతాల్లో మట్టి దిబ్బలు విరిగిపడ్డాయి. వర్షం భారీగా కురవటంతో వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. మల్కాపురం సమీపాన గల ఐవోసీ సేవా మార్గం పూర్తిగా నీట మునిగింది. ఇక్కడి గెడ్డలో నీరు పోయే మార్గం లేక సమీపంలోని సేవా మార్గం నీటితో నిండిపోయింది. ఆ మార్గాన ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు ఆయిల్ లోడింగ్‌కు వచ్చే లారీలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. లారీ చక్రాలు మునిగిపోయే స్థాయికి ఇక్కడ నీరు చేరింది. ఐవోసీలోకి కూడా నీరు చేరింది. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మల్కాపురం సేవా మార్గం, నౌసేనా భాగ్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఉన్న సేవా మార్గాల్లో నీరు నిలిచిపోయింది. 59వ వార్డు హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మట్టి చరియలు విరిగిపడ్డాయి.

నీట మునిగిన వీధులు..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం పలు వీధులు నీట మునిగాయి. ఎర్రిగెడ్డకు ఆనుకుని ఉన్న సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి, రాచవీధి తదితర ప్రాంతాలు మూడడుగుల లోతు నీట మునిగాయి. ఇళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మురుగు రహదారుల్లో చేరడంతో వీధులు దుర్గంధభరితంగా మారాయి. జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పర్యవేక్షించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.

ముగిసిన ఫిస్ట్ వారోత్సవాలు



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిస్ట్ వారోత్సవాలు జరిగాయి. మేరీ మాత మాతృమూర్తి అయిన సెయింట్ ఆన్స్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో గత వారం నుండి వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతిథిగా పాల్గొని సున్నితత్వం, సంసిద్ధత, సేవ సెయింట్ ఆన్స్ లక్ష్యాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఉపాధి అవకాశాలపై మాజీ సైనికులకు అవగాహన



మాట్లాడుతున్న ఉపాధి అధికారి సుబ్బారెడ్డి

కంచరపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో మాజీ సైనికులకు ప్రైవేటు ఆర్గనైజేషన్‌లో ఉపాధి–స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఉపాధి కార్యాలయ అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమల్లో ఉపాధి పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ ట్రేడుల్లో అవకాశాలు, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంఘాల సభ్యులు, పలు పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం




ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు భక్తులు పసుపునీళ్లతో బారులుతీరారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతో పాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవాకి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. భక్తుల నామగోత్రాలతో విశేష పూజలు జరిపారు. ఎరుకుమాంబ అమ్మవారు కలియుగంలో వెలసిన పార్వతీదేవిగా భక్తులు నమ్ముతారు. ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం చేయటం ఆచారంగా వస్తుందని అర్చకులు తెలిపారు. దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, పెద్దవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవాని పాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజారు, నర్సింహనగర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమ, పలురకాల పూలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించాలి



ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ నర్సింగరాజు

గోపాలపట్నం: విశాఖలో నేరాల నియంత్రణకు నగర పౌరులు సహకరించాలని గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ నర్సింగరాజు కోరారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లు, స్థానిక యూనియన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో ప్రయాణికులు మర్చిపోయినవి, వదిలేసిన వస్తువులు పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని సూచించారు. ఆటోల్లో ప్రయాణించే వారి వస్తువులు చోరీకి గురవడం వంటివి తరచూ జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి వారిపై దృష్టి పెట్టాలన్నారు. ఆటో ఎక్కే వారు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎక్కడ దిగుతున్నారన్న విషయాల్ని గమనించాలని తెలిపారు. జోన్–2 క్రైమ్ ఏసీపీ ఎస్. సునీల్ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

కంచరపాలెం : జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో బీటీ రహదారుల నిర్మాణానికి 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ రహదారి నుంచి కాన్వెంట్ కూడలి, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గిడ్డంగి వరకు సుమారు రూ.40 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు జోన్–5 ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేశంగిణీరావు, రాజు, శ్రీను, కుమార్, ఆనంద్, జయరాజు, శేఖర్, కార్తీక్, సాయి, వంశీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 16.24 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల లెక్కింపు నిర్వహించారు. 46 రోజులకు గాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.16,24,024 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది షేక్ హజరుద్దీన్, లక్ష్మీనారాయణ, ఇందిర రాణి, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.